క్లుప్తంగా

శరన్నవరాత్రోత్సవాలకు ధ్వజారోహణం



జనగామ: పట్టణంలోని తహసీల్ కార్యాలయం ఆవరణలో త్వరలో నిర్వహించే దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం వేద పండితులు మెళ్లచెర్వు వెంకటఅప్పయ్యశాస్త్రి, పార్లంది శ్రీనివాసశర్మ, యళ్లంబట్ల ప్రసాద్, ఆవ్వారు ఉమానాథశర్మ, తిరుపతి, లక్ష్మీప్రసాద్ శర్మ ఆధ్వర్యాన ధ్వజారోహణం(గుంజ పాతడం) నిర్వహించారు. పట్టణ ప్రముఖులు మర్యాల సతయ్య, సమిషెట్టి రవీందర్, గందె సుధాకర్, మాశెట్టి రవీందర్, గంగిశెట్టి ప్రమోద్‌కుమార్, మినుకూరి రవీందర్‌రెడ్డి, బస్సా లింగమూర్తి, గుండా సతీష్, రంగ నరసింహారావు, వినయ్‌కుమార్, జైన వెంకట్ రమణ, అశోక్, ముక్క ప్రకాష్, కీర్తి నర్సయ్య, రాము, వెంకటేశం పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేపట్టాలి

స్టేషన్‌ఘన్‌పూర్: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలపై సర్వేలు నిర్వహించి పరిష్కారం కోసం ఉద్యమాలు నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనుకారెడ్డి పిలుపునిచ్చారు. డివిజన్ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం మండల కమిటీ సమావేశం మంద మహేందర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యాకయ్య, రాజు, సుదర్శన్, మహేందర్, భాస్కర్, పరమేష్ పాల్గొన్నారు.

ఏబీవీ విద్యార్థికి బంగారు పతకం



జనగామ రూరల్: ఇటీవల కరీంనగర్‌లో జరిగిన తొమ్మిదవ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జనగామ ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ సెకండియర్ చదువుతున్న విద్యార్థి ఉదయ్‌కిరణ్ 1500 మీటర్ల పరుగులో గోల్డ్ మెడల్ సాధించాడని ప్రిన్సిపాల్ నర్సయ్య తెలిపారు. అలాగే 800 మీటర్లలో కాంస్య పతకం కైవసం చేసుకున్నాడని పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం కళాశాలలో ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం ఉదయ్‌కిరణ్‌ను అభినందించారు.

గిరిజన విద్యాభివృద్ధిపై నిర్లక్ష్యం తగదు

దేవరుప్పుల : గిరిజన విద్యాభివృద్ధిపై పాలకవర్గాల నిర్లక్ష్యం తగదని సేవాలాల్ విద్యార్థి సేన జిల్లా కార్యదర్శి లావుడియా అనిల్ చౌహాన్ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సేవాలాల్ విద్యార్థిసేన సమావేశంలో మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అనంతరం మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావాలనే తపనతో గతంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఎన్నికల ముందు పనులకు శంకుస్థాపనలు చేయడం సిగ్గుచేటన్నారు. శ్రీనివాస్, సాయి, అభినేష్, శ్రీ చైతన్య పాల్గొన్నారు.

సెల్ ఫోన్ అప్పగింత



జనగామ: ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ వ్యక్తి పోగొట్టుకున్న ఫోన్‌ను పోలీసులు తిరిగి అప్పగించిన సంఘటన గురువారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ మండలం గానుగుపహాడ్‌కు చెందిన శ్రీనివాస్ బుధవారం ఆర్టీసీ బస్టాండ్‌లో కూర్చున్నాడు. బస్సు రాగానే సెల్‌ఫోన్ బెంచీపై పెట్టి వాష్ రూంకు వెళ్లాడు. ఇదే సమయంలో పక్కనే ఉన్న మరో ప్రయాణికుడు సెల్‌ఫోన్ తీసుకొని స్విచ్ ఆఫ్ చేసి సూర్యాపేట బస్సు ఎక్కి వెళ్లిపోయాడు. వెంటనే బాధితుడు పోలీసులకు సమాచారం అందించగా క్రైం కానిస్టేబుళ్లు కర్ణాకర్, రామన్నతో కలిసి ఎస్సై మాచర్ల శ్వేత సీసీ కెమెరాలో సూర్యాపేట బస్సులో ప్రయాణికుడు తీసుకెళ్లినట్లు గుర్తించి అతని నుంచి ఫోన్ స్వాధీనం చేసుకుని శ్రీనివాస్‌కు అప్పగించారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

జఫర్‌గఢ్: మండల కేంద్రానికి చెందిన సింగారపు సత్తమ్మ (62) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. సత్తమ్మ తమ కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 4న స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి ఆటోలో జఫర్‌గఢ్‌కు వస్తుండగా రేగడి తండా శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమెతో పాటు మరో మహిళ తీవ్రంగా గాయపడింది. వెంటనే 108 వాహనంలో హనుమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు వారు తెలిపారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు శవపంచనామ నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆడపడుచులకు 'బతుకమ్మ' కానుక

బతుకమ్మ పండగను పురస్కరించుకుని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళలను గౌరవిస్తూ అందజేస్తున్న బతుకమ్మచీరలను ఆయా గ్రామపంచాయతీల్లో గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ కానుకగా ఆడపడుచులకు బతుకమ్మ చీరలు అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

- సాక్షి నెట్‌వర్క్



చిల్పూరు: చీరలు పంపిణీ చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కృష్ణారెడ్డి



నర్మెట: మచ్చుపహాడ్‌లో.. మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు శివరాజ్ గుప్తా



రఘునాథపల్లిలో.. సర్పంచ్ శివకుమార్



తరిగొప్పుల: అక్కరాజుపల్లిలో.. సర్పంచ్‌లు



జఫర్‌గఢ్: రఘునాథపల్లిలో.



కొడకండ్ల: చీరలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ జ్యోతి



బచ్చన్నపేట: బతుకమ్మ చీరలతో మహిళలు

డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని కొత్తపల్లిలో నిర్మించిన 30 డబుల్‌బెడ్రూం ఇళ్లు ఎట్టకేలకు జెడ్పీస్టాండింగ్ కమిటీ చైర్మన్, ఘన్‌పూర్ జెడ్పీటీసీ మారపాక రవి చొరవతో లబ్ధిదారులకు లాటరీపద్ధతిలో గురువారం కేటాయించారు. పలుమార్లు గ్రామసభలను నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయగా ఎవ్వరికి ఏ నంబర్ ఇల్లు అనే అంశంపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సర్పంచ్, ఎంపీటీసీ, లబ్ధిదారుల సమక్షంలో లాటరీ ద్వారా 30 మందికి ఇళ్లను కేటాయించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, డీటీ విజయ్‌కుమార్,ఆర్ఐ రవీందర్, కొత్తపల్లి సర్పంచ్ గోవిందు ఆనందం, ఎంపీటీసీ బెల్లపు వెంకటస్వామి, ఉపసర్పంచ్ ముక్కెర మహేందర్, జోగు లింగస్వామి పాల్గొన్నారు.



లాటరీ తీస్తున్న మారపాక రవి

కానిస్టేబుల్‌గా ఎంపికైంది వీరే



దొంగరి సురేష్



వినయ్‌కుమార్



దీక్షిత



పరమేశ్వరి



అశోక్

కొడకండ్ల: పట్టుదలతో పోలీస్ కొలువు సాధించాలనే దృఢసంకల్పంతో శ్రమించి పోలీస్ కొలువును సాధించారు మండలానికి చెందిన నలుగురు యువకులు. నిరుపేద కుటుంబాలకు చెందిన వీరంతా ఈసారి ఎలాగైనా ఉద్యోగం సాధించాలని పట్టుబట్టి కొలువు కొట్టారు. మండల కేంద్రానికి చెందిన కోల రవి, చిలుసాని అనీల్, దొంగరి సురేష్, రామవరం గ్రామానికి చెందిన సయ్యద్ జహరత్ పాషాలు పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు.

బచ్చన్నపేట: మండలంలోని కట్కూర్ గ్రామానికి చెందిన గొడిషెల రవి, బండ బాల్‌రాజు, మద్రికింది రమేష్‌లు, అలాగే కొన్నెకు చెందిన బడేకోలు దీక్షిత, మినుకూరి శేఖర్‌రెడ్డి, పోచన్నపేటకు చెందిన మేకల ప్రశాంత్‌రెడ్డి, లింగంపల్లికి చెందిన కొత్తపల్లి శ్రీనివాస్‌లు కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు.

పాలకుర్తి: ఈరవెన్నుకు చెందిన జవ్వాజీ సోమయ్య,నీలమ్మ దంపతుల కుమారుడు అశోక్ ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. గురువారం గ్రామస్తులు కానిస్టేబుల్‌గా ఎంపికైన అశోక్‌ను అభినందనలు తెలిపారు.

సాధించాలనే పట్టుదల.. ఉద్యోగం చేయాలనే కసి

లింగాలఘణపురం: సాధించాలనే పట్టుదల ఉంటే ఏదీ అసాధ్యం కాదని, కసితో చదివి మండలంలోని 17 మంది నిరుద్యోగులు కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికై నిరూపించారు. భర్త చనిపోయాడనే మానసిక వేదన.. అయినా ఉద్యోగం సాధించాలనే పట్టుదలకు అన్నయ్య స్ఫూర్తి తోడై ఆమె కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికై ంది. క్లాంకు చెందిన నకీర్త మౌనిక వివాహమైన ఏడాదిన్నరలోనే భర్త చనిపోయాడు. ఆరు నెలల బాబును తల్లిగారింటి వద్దనే వదిలి హైదరాబాద్‌కు వెళ్లి కోచింగ్ తీసుకొని పదేళ్ల క్రితం ఆర్మీలో ఉన్న అన్నయ్య నకీర్త స్వామి స్ఫూర్తితో కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైంది. లింగాలఘణపురం మండల కేంద్రానికి చెందిన కేమిడి శ్రీధర్, క్లాంకు చెందిన నకీర్త మౌనిక, వారాల శ్రీశైలం, ముగ్గ కరుణాకర్, వనపర్తికి చెందిన కొడె భరత్, చేవెల్లి శ్రీకాంత్, గుమ్మడవెల్లికి చెందిన గువ్వల కమలాకర్, దండిగ నరేందర్, నెల్లుట్లకు చెందిన గాడిపల్లి శివశంకర్, వడిచర్లకు చెందిన రేగు ప్రవీణ్, రేగు అజయ్, రేగు నరేశ్, నోముల కుమార్, నవాబుపేటకు చెందిన పయ్యావుల శివకుమార్, చీటూరుకు చెందిన నోముల ప్రశాంత్, నోముల అనిల్ (ప్రస్తుతం జనగామ), నేలపోగులకు చెందిన మైల రాజశేఖర్ ఎంపికయ్యారు.



కుమారుడితో మౌనిక

జఫర్‌గఢ్: ఉప్పుగల్లు గ్రామానికి చెందిన గాదెపాక ఏలీష్, ఫాతిమా దంపతుల కుమార్తె పరమేశ్వరి సివిల్ కానిస్టేబుల్‌కు ఎంపికైంది.

దేవరుప్పుల: కడవెండికి చెందిన సుడిగెల వినయ్‌కుమార్, పెద్ది క్రాంతి కుమార్, పైండ్ల రాకేష్ ఎంపికయ్యారు.

విజయవంతం చేయండి

దేవరుప్పుల: తెలంగాణ పునర్నిర్మాణంలో పాలకుర్తి రూపురేఖలు మార్చిన అభివృద్ధి కాముకులు కేటీఆర్, ఎర్రబెల్లిల ప్రత్యేక పర్యటనలను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల సమన్వయకర్త పల్ల సుందర్‌రామిరెడ్డి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ధారావత్ రామ్‌సింగ్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని నీర్మాలలో ఈ నెల 7వ తేదీన నీర్మాల, సింగరాజుపల్లి తదితర గ్రామాల్లో మంత్రి ఎర్రబెల్లి, 9వ తేదీన తొర్రూరులో జరిగే కేటీఆర్ పర్యటనలను విజయవంతం కోసం బీఆర్ఎస్ మండల నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధికార ప్రతినిధి సుడిగెల హన్మంతు, మండల ప్రధాన కార్యదర్శి చింత రవి, మాజీ ఎంపీపీ కొల్లూరి సోమన్న, సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

అర్హులను ఎంపిక చేయాలి

లింగాలఘణపురం: దళితబంధు పథకంలో అర్హులను ఎంపిక చేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు తూడి దేవదానం డిమాండ్ చేశారు. కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని క్లాంలో కేవీపీఎస్ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళిత మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, గృహలక్ష్మి పథకంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు దళితుల అభివృద్ధికి వినియోగించాలని అన్నారు. లలిత, మబ్బు వెంకటేష్, సుల్తానాబేగం, కృష్ణ, శంకర్, జాను, మల్లయ్య పాల్గొన్నారు.

కళాకారులకు సన్మానం

జనగామ: పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని జాతీయ స్థాయిలో అవార్డు పొందిన జనగామ మండలం పెంబర్తి హస్తకళాకారులను గురువారం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హస్తకళలను మరింత ప్రోత్సహించేందుకు రూ.5కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. కళాకారుల ప్రతిభ కేవలం రాష్ట్రానికి పరిమితం కాకుండా, దేశ ఎల్లలు దాటేలా తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. వచ్చే ఎన్నికల్లో భగవంతుడు మరోసారి అవకాశం ఇస్తే మీ అందరి దీవెనలతో అసెంబ్లీలో హస్తకళల గురించి మాట్లాడి మరింత వన్నె తీసుకు వస్తామన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

ప్రధాని మోదీని విమర్శిస్తే సహించేది లేదు

స్టేషన్‌ఘన్‌పూర్: భారతదేశాన్ని విశ్వగురువుగా నిలబెట్టేలా అహర్నిశలు కృషి చేస్తున్న దేశ ప్రధాని నరేంద్రమోదీని విమర్శించేస్థాయి బీఆర్ఎస్ నేతలకు ఎంతమాత్రం లేదని, మతిభ్రమించిన వాడిలా కడియం శ్రీహరి ప్రధాని మోదీని విమర్శిస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదాసు వెంకటేష్ అన్నారు. డివిజన్‌కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలో భారతదేశం ఖ్యాతిని గొప్పగా చాటుతున్న నరేంద్రమోదీని విద్యావంతుడైన కడియం శ్రీహరి విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. ఏనాడు తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని కడియం ప్రస్తుతం ఎన్నికల కోసం తెలంగాణ ఉద్యమం గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ పార్టీని విమర్శిస్తూ ఇష్టారాజ్యంగా వ్యాఖ్యలు చేస్తున్నారని, ఘన్‌పూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ గెలిస్తే తాను సెంటర్‌లో ముక్కు నేలకు రాస్తానని ఆయన సవాల్ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు గట్టు కృష్ణ, నాయకులు తాళ్లపెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేష్

స్పోర్ట్స్ కిట్లను సద్వినియోగం చేసుకోవాలి



స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ జయశ్రీ

లింగాలఘణపురం: గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అందజేస్తున్న స్పోర్ట్స్ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ జయశ్రీ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాలకు వచ్చిన క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతీ గ్రామానికి క్రీడా మైదానాలను ఏర్పాటు చేయడమే కాకుండా నేడు స్పోర్ట్స్ కిట్లను కూడా అందజేస్తుందని, ఒక్కొక్క కిట్‌లో 23 ఆట వస్తువులతో పాటు 75 టీషర్ట్స్ కూడా ఉన్నాయని, వాటిని వినియోగించుకొని క్రీడల్లో రాణించి అటు గ్రామానికి, రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతులు తేవాలని కోరారు. ఎంపీడీఓ సురేందర్, పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి అక్రమాలు..?

- పన్నులు వసూలు చేసి సొంతానికి వాడకం
- డబ్బులు లేక తోపుడు బండ్లపై చెత్త తరలింపు

లింగాలఘణపురం: మండలంలోని క్లాం గ్రామ పంచాయతీ కార్యదర్శి అక్రమాలకు పాల్పడుత్నాడనే ఆరోపణలు వస్తున్నాయి. గత కొంత కాలంగా గ్రామంలో వసూలు చేసిన ఇంటి పన్నులను ఎస్‌టీఓలో జమ చేయకుండా సొంతానికి వాడుకుంటూ పంచాయతీ అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా సర్పంచ్ తిప్పారపు ఈరమ్మ సంతకాన్ని ఫోర్జరీ చేసి ఉపాధి హామీ పథకంలో ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులను కూడా కాజేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఇదిలా ఉండగా తడి, పొడిచెత్త వేర్వేరుగా తరలించేందుకు జీపీలకు ఇచ్చిన ట్రాక్టర్లతో కాకుండా తోపుడు బండ్లపై చెత్తను తరలిస్తున్నారు. ఇదేమిటని కొంత మంది సిబ్బందిని ప్రశ్నిస్తే ట్రాక్టర్లలో డీజిల్‌కు డబ్బులు లేక తోపుడు బండ్లపై తీసుకెళుతున్నామని అంటున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి వంశీధర్‌ను ఫోన్‌లో వివరణ కోరగా ట్రాక్టర్లతోనే చెత్తను తరలిస్తున్నామని, గ్రామంలోని చిన్నచిన్న గల్లీల్లో ట్రాక్టర్ వెళ్లకపోవడంతో తోపుడు బండ్లు వినియోగిస్తున్నామన్నారు. ఇంటి పన్నుల వసూళ్లపై ప్రశ్నించగా ఇటీవల గ్రామానికి కేంద్ర బృందం వచ్చిన సమయంలో చేపట్టిన పనులకు డబ్బులు ఖర్చు అయ్యాయని, దీంతో ఎస్‌టీఓలో జమ చేయలేదని, మళ్లీ జమ చేస్తామని వివరించారు.



క్లాంలో తోపుడు బండిపై తరలిస్తున్న చెత్త

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

కొడకండ్ల: ప్రజారోగ్యంపై వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్యాధికారి హరికృష్ణ కోరారు. గురువారం పీహెచ్‌సీలో నిర్వహించిన ఆశాడే సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు గ్రామాలు, పల్లెలు, గిరిజన తండాల్లో ప్రజల ఆరోగ్యంపై దృష్టిసారించాలని, ప్రతి శుక్రవారం డ్రైడేను నిర్వహించాలని, ఆయుష్మాన్‌భారత్ కార్డులపై అవగాహన కల్పించాలన్నారు. తరుణ్, బోదాస్ రాజు, స్నేహలత, వైద్య సిబ్బంది ఉన్నారు.

పల్లెదవాఖానాల్లో విస్తృత వైద్యసేవలు

దేవరుప్పుల: పల్లెదవాఖానాల్లో సీజన్‌ల వ్యాధుల నివారణకు విస్తృత వైద్యసేవలు అందిస్తున్నట్లు మండల వైద్యాధికారిణి పూజ తెలిపారు. ఈ మేరకు గురువారం మండలంలోని నీర్మాలలో సీజన్‌ల వ్యాధుల నివారణ కోసం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించి అవసరార్డులకు మందులు పంపిణీ చేశారు.

పేదల పక్షపాతి కాంగ్రెస్

స్టేషన్‌ఘన్‌పూర్: మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ పేదల పక్షపాతి అని, కాంగ్రెస్ పార్టీ ద్వారానే అభివృద్ధి సాధ్యమని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర అన్నారు. మండలంలోని విశ్వనాథపురం కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు అక్కిరెడ్డి సంపత్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన దాదాపు 200 మంది బీఆర్ఎస్ తదితర పార్టీలకు చెందిన నాయకులు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు డివిజన్‌కేంద్రంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సింగపురం ఇందిర సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ రాష్ట్ర నాయకులు సుభాష్‌రెడ్డి, నాయకులు జగదీశ్వర్‌రెడ్డి, చింత ఎల్లయ్య, మండల పార్టీ అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, అక్కిరెడ్డి సంపత్‌రెడ్డి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలి



చిల్పూరు : అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని మండలంలోని చిల్పూరు గుట్టకు చెందిన మూల లక్ష్మి-సంపత్ దంపతులు కోరారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన అనంతరం వారు గురువారం మీడియాతో మండల కేంద్రంలో మాట్లాడారు. 20 ఏళ్ల క్రితం తాము కొనుగోలు చేసుకున్న భూమి నుంచి 40 గజాల స్థలాన్ని అన్యాక్రాంతం చేస్తుండగా కోర్టు నుంచి ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకోవడంతో సత్యనారాయణ, సారంగపాణి, నాగేందర్, సునీల్, సాంబరాజు, హరికృష్ణ, తదితరులు తమ ఇంటి మీదకు వచ్చి బోరును ధ్వంసం చేయడంతోపాటు రూ.2 లక్షల ఆస్తి నష్టం కలిగించినట్టు లక్ష్మి-సంపత్ తెలిపారు. ప్రాణభయంతో తాము పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా ఎస్సై ఎదుటే తన భర్త సంపత్‌ను కొట్టారని లక్ష్మి వాపోయారు.

సంక్షిప్త సమాచారం

బీఆర్ఎస్‌లో చేరిక

పాలకుర్తి: నర్సింగాపూర్ తండాకు చెందిన బాదావత్ తిరుపతినాయక్ ఆధ్వర్యాన కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ బీఆర్ఎస్‌లో గురువారం చేరారు. ఈ మేరకు వారికి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వారికి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే లక్ష్మీనారాయణపురం, ఇతర తండాల నుంచి పలువురు బీఆర్ఎస్‌లో చేరారు.

ఎర్రబెల్లికి రజక సంఘం మద్దతు



దేవరుప్పుల: త్వరలో జరుగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి దయాకర్‌రావుకు సింగరాజుపల్లి రజక సంఘం నాయకులు సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ఈ మేరకు గురువారం పీఏసీఎస్ చైర్మన్ లింగాల రమేష్ రెడ్డి, పార్టీ గ్రామ అధ్యక్షుడు మేకపోతుల నర్సింహ ఆధ్వర్యంలో హనుకొండలో మంత్రిని కలిశారు.

నేడు అల్పాహారం ప్రారంభం

రఘునాథపల్లి: మండలంలోని నిడిగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య చేతుల మీదుగా విద్యార్థులకు అల్పాహారం అందించే కార్యక్రమం ప్రారంభించనున్నట్లు మండల నోడల్ అధికారి రఘునందన్‌రెడ్డి తెలిపారు. గురువారం నోడల్ అధికారి మాట్లాడుతూ అల్పాహారం కార్యక్రమానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఎస్ఎంసీ కమిటీలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వెంకటస్వామికి నివాళి

జఫర్‌గఢ్: మాజీ ఎంపీ జి.వెంకటస్వామి జయంతిని తెలంగాణ మాల పోరాట సమితి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, నాయకులు గడ్డం లింగస్వామి, కుక్కల ఎల్లయ్య, సాకి సురేష్ పాల్గొన్నారు.

తాటిచెట్లను కాపాడాలి

చిల్పూరు: గీత వృత్తే ఆధారంగా కుటుంబాలను పోషిస్తున్న గీత కార్మికులు కల్లు గీస్తూ తాటి చెట్లను కాపాడాలని చిల్పూరు గౌడ సంఘం అధ్యక్షుడు మాచర్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని తాటివనంలో గురువారం మాచర్ల స్వామి ఆధ్వర్యంలో తాటిచెట్లు పంపిణీ కార్యక్రమంలో భాగంగా లక్కీడ్రా నిర్వహించారు. మాచర్ల ప్రవీణ్, నారగోని రాములు, వెంకన్న, గణగోని రమేష్, నారగోని రాజు, పంతం రాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల గర్జన పోస్టర్ ఆవిష్కరణ

లింగాలఘణపురం: ఈ నెల 8న జిల్లా కేంద్రంలో తలపెట్టిన కార్మిక గర్జన మహాసభ వాల్ పోస్టర్‌ను గురువారం మండల కేంద్రంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు రావుల సదానందం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సభకు అన్ని రంగాల కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మహిళలకు పెద్దపీట

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తున్నదని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు, కొడవటూర్ సర్పంచ్ గంగం సతీష్‌రెడ్డి అన్నారు. గురువారం గ్రామంలో మహిళా భవన్‌నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. పంచాయతీ కార్యదర్శి రూపా చైతన్య, ఫీల్డ్ అసిస్టెంట్ అశోక్, నాయకులు కరుణాకర్, శేఖర్‌రెడ్డి, కనకయ్య పాల్గొన్నారు.

జనసేనతోనే మార్పు సాధ్యం

స్టేషన్‌ఘన్‌పూర్: నియోజకవర్గంలో జనసేనతోనే మార్పు సాధ్యం అవుతుందని, అందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారని నియోజకవర్గం ఇన్‌చార్జ్ గాదె పృథ్వీ అన్నారు. మండల కేంద్రంలో గురువారం పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయాల్లో మార్పు కోసం అధినేత పవన్ కల్యాణ్ యువతకు ప్రాధాన్యత కల్పిస్తూ ఎన్నికల బరిలో దింపుతున్నారని తెలిపారు.

ఎల్‌ఓసీ అందజేత



నర్మెట: మండలంలోని ఇప్పలగడ్డ పంచాయతీలో కార్యదర్శిగా పనిచేస్తున్న సుకేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా, ప్రభుత్వం నుంచి మంజూరైన రూ. 4లక్షల ఎల్‌ఓసీని బాధిత కుటుంబానికి ఉమ్మడి బీఆర్ఎస్ మండలాల కన్వీనర్ పెద్ది రాజిరెడ్డి గురువారం అందజేశారు.

ఆర్థికసాయం

లింగాలఘణపురం: మండలంలోని వడిచర్లకు చెందిన చిటుకల సత్యనారాయణ ఇటీవల క్యాన్సర్‌తో చికిత్స పొందుతోంది. కాగా, గురువారం జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి హైదరాబాద్‌లోని నిమ్స్‌లో ఆయనను పరామర్శించి రూ.25వేల ఆర్థికసాయం అందజేశారు.

పరామర్శ

చిల్పూరు: మండలంలోని పల్లగుట్టకు చెందిన దార వెంకటమ్మ, రిటైర్డ్ ఉపాధ్యాయుడు గాజర్ల మల్లారెడ్డి గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. కాగా, విషయం తెలుసుకున్న చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు బాధిత కుటుంబాలను పరామర్శించారు. వెంకటమ్మ దహన సంస్కారాల కోసం రూ. 10వేల ఆర్థికసాయంగా పంపగా సర్పంచ్ మానస తదితరులు బాధిత కుటుంబానికి అందజేశారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

జఫర్‌గఢ్: ఇంటర్ విద్యార్థిని భవ్యశ్రీని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు యాకన్న రాథోడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ జూనియర్ కళాశాలలో భవశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు.